క్లుప్తంగా

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 7.02 లక్షలు



శ్రీవారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయం లెక్కించారు. 62 రోజులకుగాను స్వామి వారికి హుండీల ద్వారా రూ.7,02,989 ఆదాయం వచ్చింది. అలాగే హుండీల ద్వారా 36.5 గ్రాముల బంగారం, ఒక కిలో 50 గ్రాముల వెండి ఆభరణాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొండల అరుణ కుమారి, తిప్పాని మణి, స్వామి వారి సేవకులు, శ్రీ కృష్ణ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ చెన్ను రంగారావు పర్యవేక్షించారు.

నేడు సహస్ర కలశాభిషేకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ దత్త సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడి కృత్తిక సందర్భంగా గురువారం సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, కలశ పునఃపూజ, కలశోద్వాసన, ఆలయ ప్రదక్షిణ, భక్తులతో కలశ కావడి సేవ నిర్వహించనున్నారు. అనంతరం మూలవిరాట్‌కి సహస్ర కలశాభిషేకం, భక్తులచే స్వయంగా ఉత్సవ మూర్తులకు అభిషేకం, అలంకరణ, శ్రీ సుబ్రహ్మణ్య మూల మంత్ర హవనం, నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారు. సాయంత్రం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి శాంతి కళ్యాణం, అనంతరం దీపార్చన, అన్నప్రసాద వితరణ చేస్తారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలోని విద్యుత్ నార్త్ సెక్షన్ పరిధిలోని అశోక్ నగర్‌లో 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌ఆర్ పేట 11 కేవీ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం రోడ్డు, విద్యుత్ భవన్ వెనక రోడ్డు, మాగంటి వారి వీధి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛంద సేవకులు..వలంటీర్లు

వలంటీర్లకు వందనం

ఏలూరు టౌన్ : నవరత్నాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమైంది. ఆనాడు ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఏమైతే హామీలు ఇచ్చారో.. ఎన్నికల్లో పార్టీ మేనిఫెస్టోగా ఏదైతే ప్రకటించారో.. వాటిని తూ.చ తప్పకుండా అమలు చేయడమే ప్రధాన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారు. కరోనా విలయం కావచ్చు.. ఆర్థిక కష్టాలు కావచ్చు ఏది ఎదురైనా వెనుకడుగు వేయకుండా 'మేనిఫెస్టోను' పవిత్రంగా భావిస్తూ అమలు చేస్తున్నారు. ఈ మహాయజ్ఞంలో సీఎం జగనన్నకు చేదోడుగా ఉంటూ తమవంతు బాధ్యతలు నిర్వర్తించేందుకు వలంటీర్లు ముందుకు వచ్చారు. చదువుకున్న యువత, మహిళలు పెద్ద సంఖ్యలో వలంటీర్లుగా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారు. ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, సంక్షేమ పథకాలు రేషన్, పింఛన్, అమ్మఒడి, చేయూత, ఆసరా, ఇలా ప్రతి

ఏలూరు నియోజకవర్గంలో వలంటీర్లు	- 1,495
ఏలూరు అర్బన్ పరిధిలో వలంటీర్లు	- 1,018
ఏలూరు రూరల్ పరిధిలో వలంటీర్లు	- 477
నగరంలో వార్డు సచివాలయాలు	- 62
రూరల్ పరిధిలోని సచివాలయాలు	- 17
ఒక్కో సచివాలయం పరిధిలో సగటున 16 - 20 మంది వలంటీర్లు	



ఏలూరులో కరోనా సమయంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తోన్న వలంటీర్, ఆరోగ్య కార్యకర్త (ఫైల్)

ప్రభుత్వ పథకాన్ని ప్రజలకు చేరువ చేయటంలో వలంటీర్ల పాత్ర కీలకమైంది. దేశంలోనే రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కరోనా విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రాలన్నీ అరిటాకుల్లా వణికిపోతే.. ఏపీలో మాత్రం వలంటీర్లు సైనికుల్లా యుద్ధ రంగంలోకి దూకారు. నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ.. కరోనా సోకిన బాధితులను గుర్తించటం, ఆరోగ్య సిబ్బంది, పోలీసులతో కలిసి బాధితులను ఆసుపత్రులకు చేర్చటం, ఇళ్లలో ఎవరికి జ్వరం వచ్చింది, ఎవరు అనారోగ్యంతో బాధపడుతున్నారు అంటూ ఆరా తీస్తూ.. ప్రజలకు అండగా నిలిచారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



ఈయన గద్దె తనుష్.. విభిన్న ప్రతిభావంతులు. ఆయన పనులు చేయలేని స్థితిలో ఇంట్లోనే ఉంటారు. సీఎం వైఎస్ జగన్ సర్కారు ఆయనకు పింఛన్ ఇస్తూ అండగా నిలుస్తోంది. తనుష్‌కు ప్రతినెలా 1వ తేదీన ఉదయమే వలంటీర్ బాలాజీ వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. పింఛన్ సొమ్ము కుటుంబ అవసరాలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఆయన సంతోషంగా చెబుతున్నారు. ఇక వలంటీర్ తమ కుటుంబంలో సంక్షేమ పథకాలు అందిస్తూ భరోసాగా ఉంటున్నాడని ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ సభ్యుల్లా



ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించటంలో వలంటీర్ల సేవలు అభినందనీయం. గతంలో ప్రతి పథకానికి దళారులకు ఎంతోకొంత చెల్లిస్తేనే పని అయ్యేది. ఇప్పుడు అర్హత ఉంటే చాలు వెంటనే సంక్షేమ పథకాన్ని అందిస్తున్నారు. మా వలంటీర్ షేక్ నాగూర్ ప్రతి నెలా నాకు పింఛన్‌ను 1వ తేదీ ఉదయమే అందిస్తాడు. కుటుంబ సభ్యుల్లా ఉంటూ మాకు ఏమి అవసరమో తెలుసుకుంటూ, పథకాలు చేరువ చేయటం బాగుంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంది.

– సయ్యద్ ఫక్రుద్దీన్, లంకపేట మెయిన్‌రోడ్డు, ఏలూరు

దళారులు లేకుండా సేవలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు తీసుకోవాలంటే అర్హత ఉంటే చాలు. గతంలో దళారులు ఉండేవారు, వాళ్ల దగ్గరకు పది సార్లు తిరిగితే, ఎంతోకొంత ముట్టజెపితే అప్పుడు పథకాలు అందేవి. మా వలంటీర్ సురేష్ మా కుటుంబంలో చేయూత పథకం, మా అత్తగారికి ప్రతినెలా 1వ తేదీ ఉదయాన్నే పింఛన్ అందిస్తాడు. ప్రతి నెలా దగ్గరుండి మరీ రేషన్ ఇప్పిస్తాడు. ఇలాంటి సేవలు గతంలో లేవు. వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయటం బాగుంది.

– గిరిజాల శ్రీదేవి, తిలక్‌నగర్, ఏలూరు

అవినీతి రహిత సేవలు



జగనన్న ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తుంది. మా వలంటీర్ పట్టపు రేణుకాదేవి వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యాదీవెన, ఇంటిస్థలం మంజూరు కావటంలో సేవలు అందించింది. వలంటీర్లు ఇంటిదగ్గరకు వచ్చి ప్రభుత్వ పథకాలను అందించి వెళుతున్నారు. అవినీతి రహిత సేవలు చేస్తున్నారు. గతంలో ఏది కావాలన్నా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. కానీ నేడు ఇంటి వద్దకే పాలన వచ్చింది.

– షేక్ షబానా ఆజ్మీ , ఎన్‌ఆర్‌పేట, ఏలూరు

వలంటీర్ సేవానిరతికి వందనం



అమ్మ ఒడికి మహిళ నుంచి వేలిముద్రను తీసుకుంటున్న వలంటీర్ చింతాటి వెంకన్న

ఏలూరు (టూటౌన్) : ఒక పక్క జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్ల పనితీరుపై విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. అయినా వలంటీర్లు ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు. సేవల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. స్థానిక 43వ డివిజన్ కొత్తపేట 18వ సచివాలయం పరిధిలోని సబ్బవరపు వారి వీధికి చెందిన కరుముజ్జి జ్యోతి అనే మహిళకు ప్రమాదం జరిగింది. దీంతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అమ్మ ఒడి డబ్బులు పడాలంటే విద్యార్థి తల్లి వేలిముద్ర తప్పనిసరి కావడంతో ఆ ప్రాంతంలో పనిచేస్తున్న వలంటీర్ చింతాటి వెంకన్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న మహిళ చేతి బయోమెట్రిక్‌ను తీసుకుని కష్ట కాలంలో వారికి అమ్మ ఒడి పథకం వర్తింప చేసేలా చేశాడు. దీంతో స్థానిక ప్రజలు వలంటీర్ సేవలను ఎంతగానో కొనియాడారు. ఇంతలా వలంటీర్లు సేవానిరతితో పనిచేస్తుంటే జనసేన నాయకులు వారిని విమర్శించడం తగదంటూ హితవు పలుకుతున్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం

ఏలూరు రూరల్ : ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం అని, ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని జిల్లా డీఆర్వో ఏవీఎన్ఎస్ మూర్తి అన్నారు. బుధవారం ఏలూరు మండలం పైడిచింతపాడులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు సైతం ప్రభుత్వ సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రభుత్వ సేవలు ఉచితంగా పొందాలని సూచించారు. నిర్ణీత సమయంలో అర్జీదారులకు 11 అంశాల్లో ధ్రువపత్రాలు అందిస్తున్నామన్నారు. అర్హులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత తహసీల్దార్ బి సోమశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారితో కలిసి ఆయన ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ద్వారా గ్రామంలో 100 మొక్కలు నాటారు. అనంతరం అర్జీదారులకు ధ్రువపత్రాలు అందించారు. సర్పంచ్ ముంగర తిమోతి ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ రేలంగి యోహాన్, సైదు సత్యనారాయణ, ముంగర వెంకటేశ్వరరావు, పల్లెం రాజు తదితరులు డీఆర్వోకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పైడిచింతలపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మొక్క నాటుతున్న అధికారులు, పెద్దలు

విద్యుత్ ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : విధి నిర్వహణలో ఒకొక్కసారి విశ్రాంతి లేకుండా పనిచేసే విద్యుత్ ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని పరిరక్షణపై కూడా శ్రద్ధ వహించాలని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పీ.సాల్మన్ రాజు సూచించారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.శశిధర్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకుడు తురగా రామకృష్ణ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు తమ ప్రాణాలు పణంగా పెట్టి 24 గంటలూ పనిచేస్తున్నారని ప్రశంసించారు. విద్యుత్ ఉద్యోగుల పరిరక్షణ కోసం విద్యుత్ పంపిణీ సంస్థ కృషి చేస్తోందని, దీనిలో భాగంగానే వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నేత్ర వైద్యుడు డాక్టర్ సదాశివరావు, ఆయుష్ ఆసుపత్రి వైద్యులు ఎంఎల్‌వీ సాయికృష్ణ, కె.రమ్య, బి.భానుకిరణ్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.ఝాన్సీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	96	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	34	కంద	36
పచ్చిమిర్చి	80-90	బీట్‌రూట్	40
కాకర కాయలు	52	కీరా దోస	50
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	180-260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	92
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

ఆగమ పాఠశాలకు కంప్యూటర్ల బహూకరణ

ద్వారకాతిరుమల : శ్రీవారి దేవస్థానం ఆగమ పాఠశాలకు గుంటూరుకు చెందిన అక్కచెల్లెళ్లు వెలగలేటి దుర్గాదేవి, సత్యవతి 4 కంప్యూటర్లను బహుకరించారు. వీటిని ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు. ఆగమ విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించేందుకు వీటిని వినియోగించాలని ఈ సందర్భంగా దాతలు కోరారు. గతంలో సైతం ఈ దాతలు చినవెంకన్న దేవస్థానానికి ఎయిర్ కూలర్స్, అంబులెన్స్, బ్యాటరీ కార్లు, చిల్డ్రన్స్ పార్క్‌లో పరికరాలను అందజేశారు. వీరి దాతృత్వాన్ని ఆలయ అధికారులు అభినందిస్తున్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు మరింత చేరువగా గోద్రెజ్ సేవలు

గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఈడీ బర్జీస్ గోద్రెజ్ వెల్లడి

ద్వారకాతిరుమల : ఆయిల్‌పామ్ రైతులకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సేవలను మరింత చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా మరో 30 సమాధాన్ సెంటర్లను ప్రారంభించనున్నట్టు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బర్జీస్ గోద్రెజ్ తెలిపారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో నూతనంగా నిర్మించిన సమాధాన్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బర్జీస్ గోద్రెజ్ మాట్లాడుతూ ప్రతి 2 వేల హెక్టర్ల విస్తీర్ణానికి ఒక సమాధాన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి గోద్రెజ్ తోడ్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల్లో తాము కూడా భాగస్వాములవుతూ, వారికి సత్వర సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ నినాదంతో తెలుగు రాష్ట్రాల్లోని రైతన్నలకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ద్వారా విస్తృత సేవలు అందించే లక్ష్యంతో తాము ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్టు తెలిపారు. గోద్రెజ్ వన్‌స్టాప్ సొల్యూషన్ సమాధాన్ సెంటర్ల ద్వారా రైతులు అనేక రకాల సదుపాయాలను పొందొచ్చన్నారు. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, డ్రిప్ పరికరాలు, ట్రాక్టర్లు, మల్చర్లు వంటి అన్ని రకాల పరికరాలు ఈ సమాధాన్ సెంటర్‌లో రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరలకు తాము అన్ని సేవలను అందిస్తున్నామని చెప్పారు. రైతులు ఈ సమాధాన్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈఓ సగోటా నియోగి ఏవీపీ, చావా వెంకటేశ్వరరావు, జనరల్ మేనేజర్ మహంతి, డీజీఎంలు నాగ ప్రవీణ్, స్వీటీ, మురళి, శ్రీనివాస రఘు, మేనేజర్ దీపక్, సంస్థ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలి



సీపీఎం ఏలూరు నగర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నగర కార్యదర్శి పి.కిషోర్

ఏలూరు (టూటౌన్) : కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో అధికంగా వసూలు చేస్తున్న ఫీజులను అరికట్టాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్ళెం కిషోర్ డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేట సీపీఎం కార్యాలయం వద్ద ఏలూరు నగర కమిటీ సమావేశం బి.సోమయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదివిస్తున్నారన్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో నిలువ దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉన్నప్పటికీ అది ఎక్కడా అమలు కావడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు విద్యాహక్కు చట్టం 2009ని ఖచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం ఏలూరు నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు ,కె.రామాంజనేయులు, వీవీవీఎస్ ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ



స్థానిక గన్‌బజార్‌లో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న హరికృష్ణ

ఏలూరు (టూటౌన్) : మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ఆళ్ల నాని రాజకీయాల్లోకి వచ్చి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక గన్ బజార్ సెంటర్లో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ మాట్లాడుతూ ఆళ్ల నాని రెండు పదుల వయసులో రాజకీయ రంగ ప్రవేశం చేసి ఎన్నో ఉన్నత పదవులను అలంకరించి ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ నాయకులు సొంగ మధుసూదన్‌రావు, చర్మకార సంఘం నాయకులు గూడవల్లి శ్రీనివాస్, మంతపాటి నవీన్, కటారి నాగేశ్వర రావు, బేవనపల్లి లక్ష్మణ్ రావు, చింతాటి వెంకన్న, కటారి రాజేష్, లీల సాయికృష్ణ, పొలిమేర రాజు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం డివిజన్ రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం డివిజన్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద రాష్ట్ర అధ్యక్షులు మండాది వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన విజయవాడ సింగ్ నగర్లో మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో రేషన్ డీలర్ల మహాసభ నిర్వహిస్తున్నామని, డీలర్లు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సభలో మెరుగైన జీవన భృతి కల్పించడానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐతా కిషోర్, విజయవాడ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, ఏలూరు జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ. ప్రధాన కార్యదర్శి ఎ.ఉదయశ్వరరావు. వర్కింగ్ అధ్యక్షులు వెంకటేశ్వర్ నాయక్, కేఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షులు యు.జయరాజు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు నక్షత్ర హారతి

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం శ్రీచక్ర సహిత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి నక్షత్ర హారతి సమర్పించారు. తొలుత అమ్మవారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పసుమర్తి గుప్త, రమాదేవి దంపతులు అమ్మవారికి నక్షత్ర హారతిని బహూకరించారు. ఈ కార్యక్రమంలో చోడవరపు రంగా దంపతులు, ఊటుకూరి నగేష్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ ఆషాడమాస చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శాకంబరి అలంకరణ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి దాతలు, కూరగాయలు, పండ్లు గురువారం మధ్యాహ్నం 2 గంటలకల్లా అందించాలని, వివరాలకు ఆలయంలో సంప్రదించాలన్నారు.